చినుకు.. రైతుల్లో వణుకు..

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- కూలీలు దొరకక సతమతం

ముమ్మిడివరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అన్నదాతలను వణికిస్తుంది. ఆకాశంలో నల్లమబ్బులు కమ్ముకొస్తున్నాయి. ఈదురుగాలులు వీస్తూ అడపాదడపా జల్లులు పడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట సరిగ్గా చేతికొచ్చే సమయానికి వాతావరణంలో మార్పులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని అధికారులు హెచ్చరిస్తుండడంతో పంటను హడావుడిగా ఒబ్బిడి చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. మరోవైపు కోత, కుప్ప నూర్పులకు కూలీలు దొరక్క సతమతమవుతున్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలో 38 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగు చేశారు. దీపావళి నాటి నుంచి అడపాదడపా కోతలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు రైతులను ఆందోళనలోకి నెట్టేశాయి. వర్షాలకు, ఈదురు గాలులకు వరి దుబ్బులు పడిపోయి గింజలు రంగు మారే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. తుఫాను ప్రభావంతో ఇప్పటికే గత మూడు రోజులుగా ఎక్కడోచోట ఈదురుగాలులతో కూడిన వర్షపు జల్లులు పడటంతో అనేకచోట్ల పంట నేలవాలిపోతుంది. దీంతో అక్కడక్కడా కోసిన పంటను ఒబ్బిడి చేసుకొనే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరికొద్ది రోజులు వర్షాలు రాకుండా ఉంటే అత్యధిక శాతం పంట చేతికి దక్కేదని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.


ఈదురుగాలులకు నేలకొరిగిన వరి చేలు

రైతులంతా ఉరుకులు.. పరుగులు..

ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో ఎక్కడ చూసినా కోసిన పంటను కుప్పలు వేయడం, కుప్పలు నూర్చడం, పనలు కట్టీత కట్టడం వంటి పనులు చేపట్టారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ధాశులు చేసి తడిసిపోకుండా బరకాలతో కప్పి ఉంచుకుంటున్నారు. ఒకేసారి అన్ని పనులు చేపట్టడం వల్ల అవసరాలకు కూలీలు దొరకడం లేదు. అందరికీ ఒకేసారి కూలీల అవసరం రావడంతో కూలి రేట్లు అమాంతంగా పెరిగిపోయాయి. ధర ఎక్కువ ఇచ్చి అయినా పని చేయించుకుందామంటే కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణ మార్పులతో పెట్టుబడులు మరింత పెరుగుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తాళ్లరేవులో కోసిన పంటను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

వాతావరణం అనుకూలంగా లేదు

రెండు రోజుల క్రితమే కోతలు మొదలుపెట్టాం. ఇప్పుడేమో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. పంట ఒబ్బిడి చేసుకుందామంటే కూలీలు దొరకడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాదిలంక



తడిస్తే గిట్టుబాటు ధర రాదు

ఈదురుగాలులు, వర్షాలతో కోతకొచ్చిన వరి చేలు నేలకొరుగుతున్నాయి. గింజలు తడిస్తే రంగు మారి గిట్టుబాటు ధర రాదు. రైతులను మళ్లీ ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, కోరంగి



క్లుప్తంగా

ఉత్సవాల ప్రచార కార్యదర్శిగా నల్లా


నల్లా నరసింహమూర్తి

అమలాపురం టౌన్: వచ్చే నెల 16, 17 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల కమిటీలో ప్రచార విభాగం కార్యదర్శిగా అమలాపురానికి చెందిన కవి నల్లా నరసింహమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆయన గురువారం అందుకున్నారు. ఆయన నియామకంపై శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు గుర్రం రామకృష్ణారావు, అరిగెల బలరామమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

సంసోనుకు ప్రథమ బహుమతి


కవి సంసోనుకు బహుమతిని అందజేసి సత్కరిస్తున్న సాహితీవేత్తలు

అమలాపురం టౌన్: అంబాజీపేట అరిగెల బలరామమూర్తి సాహితీ కళా పీఠం నిర్వహించిన హాస్య కవితల పోటీల్లో అమలాపురానికి చెందిన కవి, తెలుగు అధ్యాపకుడు ఎస్.సంసోను రాసిన కవిత ప్రథమ బహుమతికి ఎంపికైంది. డాలర్ మోజులో పడి పరాయి దేశాలకు వలసపోతున్న మేధావుల ధన దాహంపై ఆయన రాసిన హాస్య కవితకు ప్రథమ స్థానంతో పాటు రూ.5 వేల నగదు బహుమతి లభించిందని కవి సంసోను తెలిపారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా సంసోను బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సాహితీ కళా పీఠం ఘనంగా సత్కరించింది.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి 98వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా ఆలయంలో ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, సాయి సత్యవ్రతం, స్వామివారి పూజ ఘనంగా చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబాను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సేవాదళ కన్వీనర్ గుర్రం అన్నవరం, పిండి గణపయ్య, పిండి వెంకటేశ్వరరావు, పోచినపెద్ది వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, సాయిరామ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత


రచ్చవారిపేటలో బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో లచ్చిపాలెం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాళ్లరేవు రచ్చవారిపేట గ్రామానికి చెందిన ఓలేటి శ్రీను, వైదాడి రాజుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించి బియ్యం, నిత్యావసర సరకులు అందజేసారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అయ్యప్ప స్వామి మాలలో ఉన్న కారణంగా రాలేకపోయారని, ఆయన సూచనల మేరకు తాము వచ్చామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రచ్చ ముత్యాలు, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, పొన్నాడ భైరవమూర్తి, భూసారపు పద్మారావు, కొల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

175 అక్రమ మద్యం బాటిళ్ల స్వాధీనం

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. కాట్రేనికోన మండలం చిర్రయానంకు చెందిన మేడా నాగూర్ గురువారం 175 అక్రమ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అన్నంపల్లి శివారు చింతపల్లిలంక వద్ద పట్టుకున్నామన్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ చెప్పారు.

అట్టడుగు వర్గాలకు లబ్ధి చేకూరాలి

యానాం: కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అట్టడుగు వర్గాలకు లబ్ధి చేకూరాలన్న లక్ష్యంతోనే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై వివిధ శాఖల అధికారులతో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి ప్రదర్శించే వాహనాలకు ఘన స్వాగతం పలికేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయుష్మాన్ పథకంలో మరింతమంది లబ్ధిదారులను చేర్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అరుణ్ ప్రకాశం, విద్యాశాఖాధికారి ప్రవీణ్, ఎస్పీ రఘునాయగం, డీడీ రవిశంకర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ప్రాధాన్యమివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: గృహ నిర్మాణాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ క్షేత్ర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపాధి హామీ పథకంలో వారి అవసరాలకు తగ్గట్టుగా పనులు గుర్తించి ప్రతిపాదనలు చేయాలని ఏపీఓ శ్రీనుకి సూచించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలపై ఈ నెల 26 నుంచి క్రీడాకారుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఎంఈఓ ఏడుకొండలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: ముమ్మిడివరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్తిక వన సమారాధన ఆత్మీయంగా జరుపుకోవాలి


బందోబస్తుపై సంఘ పెద్దలతో చర్చిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని వాసర్ల వెంకన్న గార్డెన్‌లో వచ్చే నెల 3న కోనసీమ శెట్టిబలిజ సంఘం నిర్వహిస్తున్న కార్తిక వన సమారాధనను ఆత్మీయ వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సూచించారు. గురువారం శెట్టిబలిజ సంఘ పెద్దలతో బందోబస్తుపై డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ క్రాంతికుమార్‌లు చర్చించి తగు సూచనలిచ్చారు. భారీ ఫ్లెక్సీలు, డీజేలు లేకుండా పోలీసులకు సహకరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘాల పెద్దలు సంసాని బులినాని, వాసంశెట్టి తాతాజీ, మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, వాసర్ల వెంకన్న, దంగేటి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ శివారు గ్రామం సావిత్రినగర్‌లో కామాడి భైరవస్వామికి చెందిన బోటును దగ్ధం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. బోటు దగ్ధం వల్ల ఆ బోటుపై ఆధారపడి జీవిస్తున్న ఎనిమిది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బోటు దగ్ధం చేసిన నిందితుల వివరాలు తాము పోలీసులకు చెప్పినా అదుపులోకి తీసుకోకుండా కాలయాపన చేస్తుండటం అన్యాయమన్నారు. బాధితులకు మద్దతుగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనకు పాల్పడ్డవారిని అరెస్ట్ చేయాలని పోలీసులను కోరగా తమకు ఐదు రోజులు సమయం కావాలన్నారని చెప్పారు. ఆర్ఏఓ మునిస్వామి శిబిరానికి వచ్చి బాధితులతో మాట్లాడారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

యానాం: విద్యార్థులు తమలో ఉన్న క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంజీజీబీహెచ్ ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన జోనల్ గేమ్స్‌లో భాగంగా అండర్–17 బాలుర ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో ఫైనల్స్‌లో పరంపేట అంబేడ్కర్ ఉన్నతపాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, కనకాలపేట ఎస్‌కేఎస్ పీవీఆర్‌ఎన్ ఉన్నత పాఠశాల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అనంతరం ఇరు జట్ల క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, జోనల్ గేమ్స్ కన్వీనర్ పాలిక ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ, వ్యాయామ టీచర్లు పాల్గొన్నారు.


ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న విద్యాశాఖాధికారి ప్రవీణ్

సెలయేరు పత్రికావిష్కరణ

ముమ్మిడివరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి, రచనా శక్తిని వెలికి తీసే ఉద్దేశంతో ప్రారంభించిన సెలయేరు మేగజైన్ నాలుగో సంచికను ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి గురువారం ఆవిష్కరించారు. అనంతరం పత్రికకు ఉత్తమ కథలందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పేరూరు హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మామిడిశెట్టి బాలాజీ ఈ పత్రికను ప్రారంభించారు. కార్యక్రమంలో బి.హనుమంతరావు, ఎం.పురుషోత్తమరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సెలయేరు పత్రికను ఆవిష్కరిస్తున్న డీఈఓ కమలకుమారి తదితరులు

కార్తికమాసంలో ప్రత్యేక పూజలు


విలసవిల్లిలో మహాలింగార్చనలో మట్టితో చేసిన శివలింగాలు

ఉప్పలగుప్తం: కార్తికమాసం సందర్భంగా మండలంలోని విలసవిల్లి గ్రామంలో అర్చకులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలింగార్చనలో భాగంగా 10వ రోజు గురువారం మట్టితో చేసిన 365 శివలింగాలను ఏర్పాటు చేశారు. ఈ మాసంలో మట్టితో చేసిన లింగాలను పూజించడం వల్ల అభీష్ట సిద్ధి కలుగుతుందని రామకృష్ణశర్మ చెప్పారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

మండల పరిధి మునిపల్లిలో కార్తిక ఏకాదశి సందర్భంగా శివాలయంలో పార్వతీ సమేత మల్లేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు బాదంపూడి సత్యనారాయణశర్మ, కొమానపల్లి కాశీవిశ్వనాథశర్మల ఆధ్వర్యంలో కల్వకొలను దుర్గాప్రసాద్, వాసవి నాగదుర్గ దంపతులచే కలశస్థాపన జరిపి, మహాలింగాభిషేకం, లక్ష బిల్వార్చన చేశారు. అనంతరం నిమ్మకాయల గోపాలరావు, నీలిమ దంపతుల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయం వద్ద అన్నదానం

తాళ్లరేవు: పవిత్ర కార్తికమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా తాళ్లరేవు నందిరేవు వద్ద గల కనకదుర్గ ఆలయం వద్ద గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.


మునిపల్లిలో ప్రత్యేక అలంకరణలో పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి

నీలకంఠేశ్వరునికి లక్షపత్రి పూజ

పవిత్ర కార్తికమాసం సందర్భంగా నీలపల్లి మీనాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం లక్షపత్రి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కంచర్ల కుటుంబీకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. నీలకంఠేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఓటరుగా నమోదు బాధ్యత అందరిది


ఓటు నమోదు చేసుకోవాలంటూ ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

యానాం: ప్రజాస్వామ్యంలో ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియలను విజయవంతం చేయాలంటూ స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్–2 విద్యార్థులు పరిపాలనాధికారి కార్యాలయం నుంచి ప్రారంభించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ డిసెంబర్ 9 వరకూ నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో 18 ఏళ్లు నిండినవారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, అదేవిధంగా సవరణలుంటే సరిచేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాకథాన్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ

అల్లవరం: మండలంలోని ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు హాకథాన్ ఆన్ ఐఓఈ సాఫ్ట్‌వేర్ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేఎన్‌టీయూకే కాకినాడ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ ఎస్.రామకృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఐటీ రంగంలో మెళకువలు తెలుసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. హ్యాక్‌థాన్ సాఫ్ట్‌వేర్ శిక్షణకు అమలాపురం, ఓడలరేవు, రాజమహేంద్రవరం నుంచి సుమారు 310 మంది విద్యార్థులు హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ఏబీఏటీ టెక్ సంస్థ కో ఫౌండర్ ఎ.భరద్వాజ్ నిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో బీవీసీ చైర్మన్ కృష్ణసతీష్, డీన్ టీవీ జనార్ధనరావు, బీవీసీ భట్లపాలెం ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.


హ్యాక్‌థాన్ సాఫ్ట్‌వేర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వృద్ధులకు పండ్లు, భోజనం పంపిణీ

యానాం: ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగచైతన్య పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం నాగచైతన్య అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, కేక్‌లను పంపిణీ చేయడంతో పాటు భోజనాలు సైతం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సందీప్, రేవతి, వినయ్, వర్మ, మురళి, భవాని పాల్గొన్నారు.


వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న సినీనటుడు నాగచైతన్య అభిమానులు

మల్లాడికి జీజీహెచ్‌లో వైద్యం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం స్వల్ప అస్వస్థతకు గురవడంతో ఆయనను స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం ఆయనకు వైద్యులు మెరుగైన చికిత్స అందించగా కోలుకుని తిరిగి ఇంటికి వెళ్లారు. ఇంట్లో పూజ చేస్తుండగా లోబీపీకి గురవ్వడంతో ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు.

జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు


వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక ఏవీఆర్ నగర్‌లోని వార్డు సచివాలయం వద్ద గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే సభకు ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను, అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి సమాచార ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్, తోరం గౌతమ్ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజ్, ఎంపీపీ మిరియాం జ్యోతిల ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ పరిధిలో 5,986 మంది లబ్ధిదారులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.18,57,01,645 అందజేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాశే రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, పెన్మత్స వాసురాజు, అజయ్, మామిడి శెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని గోడితిప్ప సచివాలయం వద్ద ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, నాతి శ్రీనివాసరావు, తిక్కా ప్రసాద్, ఎంపీటీసీలు రాజేశ్వరి, గుబ్బల బాబ్జి పాల్గొన్నారు.

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బూరెల వెంకట్రాజు అన్నారు. గురువారం చొల్లంగి పంచాయతీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచాయతీలో వివిధ పథకాల ద్వారా సమకూరిన రూ.23 కోట్ల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పి.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ శివాజీ గణేష్, మాసా శ్రీనివాస్, వారా సూర్యకుమారి పాల్గొన్నారు.


కిత్తనచెరువులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


గోడితిప్పలలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అమలాపురం రూరల్: లబ్ధిదారులకు ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి అన్నారు. బండారులంక సచివాలయంలో సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ పిచ్చిక శాంతి ప్రభాకర్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలిపు నాగ శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుత్తుల జానకిలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పెదపూడి బాబురావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు, ముషిణి నాగరాజు, భోజపల్లి గణేష్ పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన, కందికుప్ప సచివాలయాల్లో సర్పంచులు గంటి వెంకట సుధాకర్, చల్లగల వెంకటలక్ష్మిల అధ్యక్షతన గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి డిజిటల్ స్క్రీన్‌ను జెడ్పీటీసీ నేల కిషోర్ ఆవిష్కరించారు.


మురమళ్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


బండారులంకలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ డోలామణి

సీఎం జగన్ ప్రభుత్వంలోనే ఇంటింటికీ సంక్షేమం

- జనసేన మద్దతురాలు, సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలంతా మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలని జనసేన మద్దతుతో గెలుపొందిన సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి అన్నారు. మండలంలోని కూనవరంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు సంక్షేమాల పట్టికను ప్రారంభించారు. కిత్తనచెరువులో పార్టీ జెండాను వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాట్రు ధనలక్ష్మి, గ్రామ కమిటీల అధ్యక్షులు ఆకుల చిన్ని, దేవరపల్లి నానిబాబు, సచివాలయ కన్వీనర్ పి.శ్రీ నుబాబు, కాట్రు కృష్ణ, బూసి మనోహర్, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు పాల్గొన్నారు.